క్లుప్తంగా

నేడు ములకలచెరువులో వైఎస్సార్ ఆసరా సభ

ములకలచెరువు: మండల కేంద్రంలో బుధవారం వైఎస్సార్ ఆసరా బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఆసరా బహిరంగ సభకు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేస్తారని ఎంపీపీ సాయిలీలా తెలిపారు. సభకు మండలంలోని ప్రజా ప్రతినిధులు, అధికారులు, నాయకులు హాజరు కావాలని కోరారు.

నూతన నియామకం

వాల్మీకిపురం: మాలమహానాడు ఉమ్మడి చిత్తూరు జిల్లా ఉపాధ్యక్షుడిగా మండలంలోని విఠలం గ్రామానికి చెందిన మల్లిగారి వెంకటస్వామి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం మాలమహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ యమలా సుదర్శన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాలల హక్కులపై పోరాటం చేస్తామన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం

కేవీపల్లె : మండలంలోని వివిధ గ్రామాల్లో బుధవారం వైఎస్సార్‌సీపీ గ్రామ స్థాయి కార్యకర్తల సమావేశాల నిర్వహించనున్నట్లు పార్టీ మండల కన్వీనర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి, పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో సమావేశాలు ఉంటాయని తెలిపారు.

ఎంపీ సొంత నిధులతో మసీదుకు నిర్మాణ సామగ్రి


మసీదుకు నిర్మాణ సామగ్రి అందజేస్తున్న దృశ్యం

పీలేరు రూరల్ : పట్టణంలోని రాజీవ్‌నగర్ కాలనీలో ఆయిషా మసీదు నిర్మాణ పనులకు రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి సహకారంతో మెటీరియల్ వితరణ చేసినట్లు ఏఎంసీ డైరెక్టర్ కాలనీ చిన్న, మాజీ ఎంపీటీసీ నాగరాజనాయక్ తెలిపారు. మంగళవారం మసీదు పెద్దలకు మెటీరియల్ అందజేవారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 150 బస్తాల సిమెంట్ తోపాటు ఇసుక, కంకర అందించినట్లు తెలిపారు. దీంతో ముస్లిం మైనారిటీ నాయకులు ఎంపీ, ఎమ్మెల్యేలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వీరమోహన, నాగార్జున, మైనారిటీ నాయకులు ఖాదర్‌బాషా, హయాత్‌బాషా, అయ్యాసాహెబ్, నజీర్, ఎస్. బాషా, షాకీర్, అల్తాఫ్‌బాషా పాల్గొన్నారు.

మార్కెట్ యార్డు ఆదాయం రూ.7.19 కోట్లు


జిల్లా మార్కెట్ యార్డు అధికారి త్యాగరాజ్

పీలేరు రూరల్ : జిల్లాలోని పది మార్కెట్ యార్డుల ద్వారా 2023–24 ఆర్థిక సంవత్సరానికి టార్గెట్ రూ.7.49 లక్షల టార్గెట్‌కు గానూ ఇప్పటి వరకు రూ. 7.19 కోట్లు వసూలు అయినట్లు జిల్లా మార్కెట్ యార్డు అధికారి టి. త్యాగరాజ్ తెలిపారు. మంగళవారం స్థానిక మార్కెట్ యార్డును ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో పది మార్కెట్ యార్డులు ఉన్నాయని, ఇందులో లక్కిరెడ్డిపల్లె మార్కెట్‌యార్డు ద్వారా రూ. 40 లక్షలకు గానూ రూ. 75 లక్షలు వసూలు చేసి మొదటి స్థానంలో నిలిచినట్లు తెలిపారు. పీలేరు రూ. 40 లక్షలకు గానూ ఇప్పటి వరకు రూ. 27.37 లక్షలు వసూలు చేసి వెనుకబడి ఉన్నట్లు చెప్పారు. పీలేరులో రైతుబజారు ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపుతున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ కార్యదర్శి సురేంద్ర పాల్గొన్నారు.

మిట్స్ కరస్పాండెంట్‌కు ఎక్సలెన్స్ అవార్డు

కురబలకోట: అంగళ్లులోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ ఎస్. విజయభాస్కర్ చౌదరికి ఎడ్యుకేషన్ సెక్టార్‌లో ఎక్సలెన్స్ అవార్డు లభించింది. హైదరాబాద్ రవీంద్ర భారతిలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణా రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ఉన్నత విద్యలో కళాశాల సాధించిన పరిశోధనలు, విద్యా ప్రమాణాలు, సాంకేతిక రంగంలో చేసిన సేవలకు అవార్డు లభించినట్లు ప్రిన్సిపాల్ యువరాజ్ మంగళవారం తెలిపారు.

మెరుగైన వైద్యసేవలు

తంబళ్లపల్లె: స్థానిక వైద్య విధానపరిషత్ ప్రభుత్వ ఆసుపత్రిలో అత్యాధునిక సౌకర్యాలతో మెరుగైన వైద్యసేవలు అందించాలని కాయకల్ప రాష్ట్ర వైద్యబృందం డాక్టర్ సురేష్ సూచించారు. మంగళవారం సీహెచ్‌సీ ఆసుపత్రిని సందర్శించారు. ఆపరేషన్ థియేటర్, స్కానింగ్ సెంటర్, ఇంజక్షన్ రూమ్, ల్యాబ్, ఫార్మసిస్ట్ రూమ్, ఎక్స్‌రే విభాగం, ఐసీటీసీ, ఓపీ కౌంటర్, మహిళల వార్డు, కోవిడ్ వార్డులను పరిశీలించారు. రికార్డులు పరిశీలించారు. డాక్టర్లు, వైద్య సిబ్బంది పనితీరుపై తెలుసుకున్నారు. పరిశుభ్రత, శానిటేషన్ సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఆ బృందంలో స్టేట్ డేటా ఎంట్రీ ఆపరేటర్ ఐడీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా కంట్రోలింగ్ ఆఫీసర్ నాగమణి తదితరులు ఉన్నారు.

భవానీ..భక్తుల మొర ఆలకించమ్మా

- ఘనంగా సీటీఎం తిరునాల
- పురవీధుల్లో అమ్మవారి ఊరేగింపు
- మొక్కులు తీర్చుకున్న భక్తులు


నలవీర గంగాభవానీ ఊరేగింపు దృశ్యం


ఆలయం ఎదుట పాటలు ఆలపిస్తున్న ఆసాదులు


క్యూలో అమ్మవారి దర్శనానికి భక్తులు


అమ్మవారిని దర్శించుకున్న వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్ అహ్మద్

మదనపల్లె సిటీ: మదనపల్లె మండల సీటీఎం నలవీర గంగాభవానీ జాతర ఉత్సవాల్లో భాగంగా మంగళవారం తిరునాల ఘనంగా జరిగింది. అమ్మవారిని ప్రత్యేక వాహనంలో సీటీఎం పురవీధుల్లో ఊరేగించారు. అడుగడుగునా భక్తులు అమ్మవారికి కర్పూరనీరాజనాలతో టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.నలవీర గంగాభవానీ..చల్లంగా చూడమ్మా అని పూజలు చేశారు. తిరుపతి–మదనపల్లె రోడ్డు జనసంద్రంగా మారింది. సీటీఎం పరిసర ప్రాంతాల గ్రామాల ప్రజలు మొక్కుల కోసం చాందినీబండ్లు, అన్నం వాహనాలను మేళతాళాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. వందలాది బండ్లు అమ్మవారి ఆలయం వద్దకు చేరుకున్నాయి. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. మహిళలు పసుపు, కుంకుమ, సారె,చీరెలను సమర్పించారు. ఆలయం ధ్వజస్తంభం ఎదుట టెంకాయలు కొట్టి నిమ్మకాయలతో దీపాలు వెలిగించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అసాదివారు గంగను కీర్తిస్తూ పాటలు పాడారు.

అమ్మవారిని దర్శించుకున్న నిసార్ అహ్మద్: నలవీర గంగా భవానీ జాతర పురస్కరించుకుని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నిసార్ అహ్మద్ అమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయ్ తిప్పారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ జింకా వెంకటా చలపతిలు అమ్మవారిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. ఆలయ కమిటీ నిర్వాహకులు ఆనందపార్థసారధి, పాగాకు వీరప్రతాప్, వెలుగు చంద్ర ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.


కోలాహలంగా జాతర ప్రాంగణం

జాతర పురస్కరించుకుని ఆలయం వద్ద కోలాహలం నెలకొంది. దుకాణాల వద్ద కొనుగోలుదారులతో కిటకిటలాడింది. కొలంబస్, జెయింట్‌వీల్‌తో పాటు ఆటలతో సందడిగా మారింది. బుధవారం దోపు తిరునాలతో జాతర ముగుస్తుందని నిర్వాహకులు ఆనంద పార్థసారథి తెలిపారు. 28న ఎదుట పరుష నిర్వహించనున్నట్లు చెప్పారు.

పోలీస్ స్టేషన్‌కు చేరిన ఇంటర్ ప్రశ్న పత్రాలు

రామసముద్రం/నిమ్మనపల్లె: ఇంటర్మీడియట్ మొదటి, రెండో సంవత్సరం పరీక్షలకు సంబంధించిన ప్రశ్నపత్రాలను మంగళవారం పోలీస్‌స్టేషన్‌కు చేరినట్లు రూట్ ఆఫీసర్ విజయకుమార్, చీఫ్ సూపరింటెండెంట్ ఆఫీసర్, రిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, ఎస్‌ఐ చంద్రశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా చీఫ్ మాట్లాడుతూ మార్చి 1 నుంచి 15వ తేదీ వరకు ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షలు జరగనున్నట్లు తెలిపారు. వచ్చిన పత్రాలను పోలీస్ స్టేషన్‌లో సీలు చేసి భద్రపరచినట్లు పేర్కొన్నారు. అలాగే ఇంటర్మీడియట్ పరీక్ష ప్రశ్నాపత్రాలు మంగళవారం నిమ్మనపల్లె పోలీస్ స్టేషన్‌కు చేరాయి. ప్రిన్సిపల్, పరీక్షల ముఖ్య నిర్వహణ అధికారి రాధాకృష్ణయ్య, డిపార్ట్‌మెంటల్ అధికారి రెడ్డప్ప రెడ్డితో కలిసి స్థానిక పోలీస్ స్టేషన్లో వాటిని భద్రపరిచారు.

శయనోత్సవంతో ముగిసిన ఉత్సవాలు



రామసముద్రం: రామసముద్రం మండల కేంద్రంలో వెలసిన పురాతన శ్రీలక్ష్మీ జనార్దనస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం స్వామివారి ఉత్సవాలు శయనోత్సవంతో ముగిశాయి. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు ఘనంగా నిర్వహించారు. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని భక్తిశ్రద్ధలతో పూజించి మొక్కులు చెల్లించుకున్నారు.

కోళ్లబైలులో మహిళలకు ప్రత్యేకంగా పోలింగ్ కేంద్రం

- ఓటర్ హెల్ప్‌లైన్ యాప్‌ను వినియోగించుకోవాలి
- రాజకీయపార్టీలు బీఎల్ఏలను నియమించుకోవాలి
- ఆర్డీఓ హరిప్రసాద్


రాజకీయపార్టీల ప్రతినిధులతో సమావేశమైన ఆర్డీఓ హరిప్రసాద్

మదనపల్లె : మదనపల్లె నియోజకవర్గంలోని కోళ్లబైలులో మహిళలు ఓటుహక్కు వినియోగించుకునేందుకు ప్రత్యేకంగా పోలింగ్ కేంద్రం.నెం.5ను మహిళా పోలింగ్ కేంద్రంగా ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్డీఓ హరిప్రసాద్ తెలిపారు. మంగళవారం స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ....కోళ్లబైలులో ఓ పోలింగ్ కేంద్రంలో 1,570 మంది ఓటర్లు ఉండటంతో, 1500 దాటితే అదనపు కేంద్రం ఏర్పాటు చేయాలన్న ఎన్నికల సంఘం నిబంధల మేరకు పోలింగ్ స్టేషన్ నెం.5ను మహిళలకు కేటాయిస్తున్నట్లు తెలిపారు. ఓటరు జాబితాలో పేరుమార్పులు, నమోదు తదితర ప్రక్రియలు స్థానికంగా బీఎల్వోలు చేస్తారని, ఓటు తొలగించేందుకు మాత్రం సీఈఓ చేయాల్సి ఉంటుందన్నారు. సూపర్‌వైజర్లు బీఎల్వోలతో పాటుగా ప్రతి ఓటరు లిస్టులను తనిఖీ చేయాల్సి ఉంటుందన్నారు. నియోజకవర్గంలో జనాభాతో పోలిస్తే... యువత ఓటు నమోదుశాతం తక్కువగా కనిపిస్తోందని, 18 ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలన్నారు. కాలేజీల్లో ఓటుహక్కు నమోదు, అవగాహన కల్పించేందుకు ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్‌ల నుంచి క్యాంపస్ అంబాసిడర్స్‌ను నియమిస్తున్నామన్నారు. స్టూడెంట్స్ తమ ఓటును తాము చదువుతున్న ప్రాంతం లేదా నివాసస్థలంలో ఎక్కడైనా వినియోగించుకునే వెసులుబాటు ఉందన్నారు. ఓటుహక్కు ఉందా లేదా తెలుసుకునేందుకు, ఓటరు నమోదు, ఇతరత్రా అంశాలపై అవగాహన పెంచుకునేందుకు ప్రతి ఒక్కరూ తమ సెల్‌ఫోన్‌లలో ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన ఓటరు హెల్ప్‌లైన్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. మొబైల్, ఎపిక్ నెంబర్‌ను ఉపయోగించి ఈ యాప్‌లో సులభంగా ఓటును తనిఖీ చేసుకోవచ్చన్నారు. అన్ని రాజకీయపార్టీలు బూత్‌లెవల్ ఏజెంట్లను నియమించుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమాదేవి, ఎలక్షన్ డీటీ అస్లాం, టీడీపీ దేవరింటి శ్రీనివాసులు, సీపీఎం శ్రీనివాసులు, హరీంద్రనాథ్‌శర్మ, ఆప్ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యం


జగనన్న సురక్ష మెడికల్ కిట్లు అందజేస్తున్న సర్పంచ్, ఉపసర్పంచ్, వైద్యులు

వాల్మీకిపురం: పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి శ్రీకారం చుట్టారని సర్పంచ్ గంగులమ్మ, ఉపసర్పంచ్ కేశవరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల్లో నిపుణులైన వైద్యులచే పరీక్షలు నిర్వహించి,అవసరమైన వారికి ఉన్నత వైద్యం అందించడం జరుగుతుందన్నారు. వేల రూపాయలు ఖర్చు చేసినా అందని వైద్యాని రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో అందిస్తుందన్నారు. ప్రజలు ఈ వైద్య శిబిరాలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుధాకర్ రెడ్డి, ఈవో రెడ్డి ప్రసాద్ రెడ్డి, డాక్టర్లు చౌదరి నయీమ్, శ్రీలక్ష్మి, నాయకులు నీళ్ల భాస్కర్, అబ్దుల్ కలీమ్, ఆనంద, మహబూబ్‌బాషా, రాజేష్, శంకర, సైఫుల్లా, చికెన్ మస్తాన్, షాహెద్, సాధిక్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు న్యాయం చేయకుంటే హైవే పనుల అడ్డగింపు

– ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం హెచ్చరిక


మాట్లాడుతున్న రైతుసంఘం నాయకులు

మదనపల్లె : మదనపల్లె–తిరుపతి ఫోర్‌లేన్ నిర్మాణంలో, కొత్తవారిపల్లె పంచాయతీ పాలెంకొండ వద్ద రైతులకు అనువుగా అండర్‌గ్రౌండ్ బ్రిడ్జి నిర్మించాలని, లేనిపక్షంలో హైవే పనులను అడ్డుకుంటామని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం నాయకులు హెచ్చరించారు. కొత్తవారిపల్లి పంచాయతీ పాలెంకొండ గ్రామంలో రైతు సంఘం నాయకుడు కృష్ణమూర్తి అధ్యక్షతన రైతు సంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్.నరసింహులు మాట్లాడుతూ బెంగళూరు తిరుపతి హైవే నిర్మాణ పనుల్లో భాగంగా కొత్త వారిపల్లి పంచాయతీ గ్రామ రైతులకు ఏర్పాటు చేయవలసిన అండర్ గ్రౌండ్ బ్రిడ్జిలను ఏర్పాటు చేయనందువల్ల రైతులకు అనేక రకాల నష్టాలు జరుగుతున్నది, రైతులు వ్యవసాయం చేసుకోవాలన్న సిటిఎం చెరువు వద్దకు తమ సాగు పనులు చేసుకోవాలన్న ,హైవే రోడ్డు క్రింద బ్రిడ్జిలు నిర్మాణం జరగనందు వల్ల గ్రామస్తులు తమ పొలాలకు వెళ్ళలేకపోతున్నారన్నారు. రైతులు వ్యవసాయం చేసుకోలేక చాలా ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ విషయమై అనేక సార్లు జిల్లా కలెక్టర్, స్థానిక అధికారులకు తెలియజేసిన ప్రయోజనం లేదన్నారు. దీంతో విధిలేక హైవే రోడ్డు పనులను అడ్డుకోవాల్సి వస్తోందన్నారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమల రంగారెడ్డి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, రైతు సంఘం కార్యదర్శి కృష్ణమూర్తి, తిరుమల, రైతు నాయకులు రమణ హరి తదితరులు పాల్గొన్నారు.

‘పల్స్ పోలియో’ను విజయవంతం చేద్దాం


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైద్య సిబ్బంది

వాల్మీకిపురం: పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని చింతపర్తి, నగిరిమడుగు పిహెచ్‌సిల వైద్యులు మహమ్మద్ వసీమ్, చౌదరి నయీమ్‌లు అన్నారు. మంగళవారం స్థానిక పంచాయతీ కార్యాలయం, మండలంలోని చింతపర్తి పిహెచ్‌సిలో మార్చి 3వ తేది జరగనున్న పల్స్‌పోలియో కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పుట్టిన బిడ్డ నుండి ఐదేళ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలన్నారు. మార్చి 3న ఉదయం 7గంటల నుండి సాయంత్ర 5గంటల వరకు పోలియో చుక్కలు వేయడం జరుగుతుందన్నారు. మార్చి 3న వేయని పిల్లలకు, మార్చి 4, 5వ తేదిలల్లో ఇంటింటికి వెళ్లి పోలియో చుక్కలు వేయని పిల్లలను గుర్తించి పోలియో చుక్కలు వేయడం జరుగుతుందన్నారు. 5386 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయడమే లక్ష్యంగా ముందుకెళ్లాలన్నారు. అనంతరం పల్స్ పోలియో చుక్కల గోడపత్రికలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్‌లు సుధాకర్, భానుబి, సిహెచ్‌వో ఇందిర, హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫి, తదితరులు పాల్గొన్నారు.

టెట్ పరీక్షా కేంద్రం పరిశీలన

మదనపల్లె సిటీ: మదనపల్లె పట్టణం చిత్తూరు రోడ్డులోని ఆదిత్య ఇంజనీరింగ్‌కాలేజీలో నిర్వహించే టెట్ పరీక్ష కేంద్రాన్ని మంగళవారం డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ వి.ఎం.మస్తానయ్య పరిశీలించారు. పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. పలు విషయాలను కాలేజీ ప్రిన్సిపాల్ సతీష్‌బాబును అడిగి తెలుసుకున్నారు.

బీటీ కళాశాల సందర్శన గొప్ప అనుభూతి

– స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ మస్తానయ్య


రవీంద్రనాథ్ ఠాగూర్ కాటేజీని సందర్శిస్తున్న డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ మస్తానయ్య

మదనపల్లె : రాయలసీమలో మొదటి, చారిత్రక నేపథ్యం కలిగిన బిసెంట్ థియోసఫికల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సందర్శించడం గొప్ప అనుభూతి అని డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ మస్తానయ్య తెలిపారు. మంగళవారం టెట్ పరీక్షల నిర్వహణ తనిఖీలో భాగంగా మదనపల్లెకు వచ్చిన ఆయన.. బీటీ కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్.జి.ఆనందరెడ్డి ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మస్తానయ్య బీటీ కళాశాల స్థాపన నేపథ్యం, ఐరిష్ వనిత అనిబిసెంట్, బిసెంట్ దివ్యజ్ఞాన సమాజం తదితర అంశాలపై అడిగి తెలుసుకున్నారు. కళాశాలలోని సమావేశమందిరం, బ్రిటీష్ కాలంలో కట్టిన కట్టడాలను, కళాశాల వాతావరణం చూసి ముగ్ధులయ్యారు. అనంతరం కళాశాల ఆవరణలోని రవీంద్రనాథ్ ఠాగూర్ కాటేజీని సందర్శించారు. విజిటర్స్ బుక్‌లో పవిత్ర ప్రదేశాన్ని సందర్శించడం తన అదృష్టమని రాసి సంతకం చేశారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపకసంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్.మలిగిరాఘవరెడ్డి, తెలుగు అధ్యాపకులు దేరంగులశ్రీనివాస్‌లు కళాశాల వారసత్వ సంపదను చూపించారు. బీటీ కళాశాలను సందర్శించిన వారిలో మదనపల్లె డీవైఈఓ ఎస్.పురుషోత్తం, సమగ్రశిక్ష కోఆర్డినేటర్ కె.జనార్ధన, కురబలకోట ఎంఈఓ ద్వారకనాథ్, మదనపల్లె ఎంఈఓ టి.రాజగోపాల్ తదితరులు ఉన్నారు.

ఓటర్ల జాబితా అందుబాటులో ఉంచాలి

తంబళ్లపల్లె: బీఎల్‌వోలు ప్రతి పోలింగ్‌బూత్ కేంద్రం వద్ద నూతన ఓటర్ల జాబితాను అందుబాటులో ఉంచాలని తహసీల్దార్ బ్రహ్మయ్య తెలిపారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయ సమావేశపు హాలులో బీఎల్‌వోలతో సమావేశం నిర్వహించారు. ఓటర్లు జాబితాను పరిశీలించి తప్పు,ఒప్పులు ఉంటే వాటిని గుర్తించి సరిచేయాలన్నారు. అర్హులు జాబితాలో నమోదు చేసుకునే అవకాశం కల్పించాలన్నారు. ఎవరైన ఎక్కువ మొత్తంలో ఓటర్ల తొలగింపునకు ఫారమ్ ఇస్తే వాటిని తిరస్కరించాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో కృష్ణమూర్తి, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

బీఎల్ఓలు చురుగ్గా విధులు నిర్వహించాలి

– జేసీ ఫర్మాన్ అహ్మద్

కేవీపల్లె /కలికిరి: ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో బీఎల్‌ఓలు చురుగ్గా విధులు నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ అన్నారు. మంగళవారం కలికిరి, కేవీపల్లెలో బీఎల్‌వోలు, రెవెన్యూ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఫారం 6, ఫారం 7, ఫారం 8 పరిశీలన పారదర్శకంగా చేపట్టాలని ఆదేశించారు. వచ్చిన దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించాలని తెలిపారు. విధి నిర్వహణలో నిర్లక్ష్య ధోరణి చూపరాదన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ నయాజ్ అహ్మద్, ఎంపీడీవో రెడ్డెయ్య, ఈఆర్‌వో రమా పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

మదనపల్లె : కారులో కర్ణాటక మద్యం అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు పంపినట్లు తాలూకా సీఐ ఎన్.శేఖర్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... చీకలబైలు చెక్‌పోస్ట్ వద్ద పోలీసుల సాధారణ తనిఖీల్లో కర్ణాటక నుంచి కేఏ–52, పీ–2526 మహీంద్రా ఎక్స్‌యూవీ వాహనంలో సుమారు 30 లీటర్ల నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ తరలిస్తున్నట్లు గుర్తించామన్నారు. దీంతో మద్యంతో సహా వాహనాన్ని స్వాధీనం చేసుకుని, నందలూరుకు చెందిన పులి నవీన్ (38)ను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు పంపడం జరిగిందన్నారు. అలాగే.. జిల్లా ఎస్పీ కృష్ణారావు ఆదేశాల మేరకు, చీకలబైలు చెక్‌పోస్ట్ వద్ద డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను ముమ్మరం చేశామన్నారు.

టౌన్ సర్వీసులు నడపాలని వినతి

మదనపల్లె సిటీ: పట్టణంలోని పరిసర ప్రాంతాలకు టౌన్ సర్వీసులు నడపాలని అపెక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం ఆర్టీసీ –1 డిపో మేనేజర్ వెంకటరమణారెడ్డికి వినతి పత్రం అందజేశారు. చిప్పిలి నుంచి సిటీఎం, అంగళ్లు నుంచి ఈడిగపల్లెలకు టౌన్ సర్వీసులు నడపాలని కోరారు. అలాగే పలు ప్రాంతాల్లో టౌన్ సర్వీసులు నడపాలని కోరారు.

ఉచితంగా కార్పొరేట్ తరహా వైద్యం

రామసముద్రం: పేదలందరికీ జగనన్న ఆరోగ్య సురక్షలో ఉచితంగా కార్పొరేట్ తరహా వైద్యం అందిస్తున్నట్లు ఎంపీడీఓ నారాయణస్వామి తెలిపారు. మంగళవారం కుదురుచీమనపల్లె సచివాలయంలో సర్పంచ్ శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ జగనన్న సురక్ష పేరుతో పేదలకు వైద్యం అందించాలన్న లక్ష్యంతో వైద్య శిబిరాలు నిర్వహించినట్లు తెలిపారు. పేదవాడికి కార్పొరేట్ వైద్యం అందించిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో వైస్ఎంపీపీ రమణారెడ్డి, వైద్యాధికారిని ప్రత్యూష, కంటి వైద్యులు అర్జున్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది , ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.